# పిడికెడు మట్టి



"నా కేమన్నా తెచ్చావా, నాన్నా?" అని అడిగాడు పదేళ్ల పసివాడు గోపి, పట్నం వెళ్లి వచ్చిన నన్ను. నేనంటే వాడికి బాగా ప్రాణం. నన్ను విడిచి క్షణం ఉండడు. ఎక్కడికన్నా బయలు దేరితే "నేనూ వస్తా, నాన్నా" అంటూ వెంట తగులుతాడు. ఇల్లు విడిచి గడపలో అడుగు పెడితే చాలు, ఎక్కడినుంచి చూస్తాడో ఏమో చఱ్రున పరిగెత్తుకువచ్చి "ఎక్కడికి, నాన్నా, నువ్వు వెళ్లేది?" అని అడుగుతాడు నిలవేసి. ఓ సారి ఇట్లాగే విసుగెత్తి "ఏట్లోకి" అన్నాను. దాంతో తగ్గి ఊరుకోవచ్చురా? "ఒరే, అన్నాయ్. నాన్న ఏట్లోకి వెళ్లుతున్నాట్ట. రారా మనంగూడా వెళదాం" అని కేకేశాడు ఇంట్లో ఉన్న వాళ్ల అన్నను! పక్కున నవ్వేశాను అంత చిరాకులోనూ.

మావాడని చెప్పటం కాదుగాని గోపి చాలా చురుకైనవాడు. ప్రతివాళ్లతోనూ ఇట్టే జట్టు కలిసిపోతాడు. ఓ సారేమైందో తెలుసా? వాళ్ల మామయ్య వచ్చాడు. "ఎరా గోపీ, ఏం చదువుతున్నావు?" అని అడిగాడు. చదువంటే వాడికి ప్రాణం. అడిగిందే తడవుగా "అన్నాయ్ ఇంకా నాలుగే, మామయ్యా. నేను మూడు!" అన్నాట్ట. మా బావమరిది ఇప్పటికీ ఆ మాట జ్ఞాపకం చేస్తూ ఉంటాడు.

మాటల ధోరణిలో మరిచాను. "నా కేమన్నా తెచ్చావా, నాన్నా" అని గదూ మావా డడిగాడని చెబుతున్నాను? మాది పల్లెటూరు కావటాన పట్టణ వాసపు వస్తువులు మాకు అపురూపం. అందుకని పట్నం వెళ్లినప్పుడల్లా మిఠాయిలూ, బిస్కట్లూ, పంపరపనసపళ్లూ, బొమ్మలూ, రెడీమేడ్ దుస్తులూ లాంటివి తెస్తూంటాను. ఇంతేకాదు, పంట అమ్మిన డబ్బు చేతబుచ్చుకుని, బస్తీ వెళ్లామంటే ఇంటిల్లిపాదికీ గుడ్డలూ దుప్పట్లూ, ఇత్తడి రాగిపాత్రలు—ఒకటేమిటి, జీవితావసరాలకు కావలసిన వస్తువులన్నీ తెచ్చుకుంటుంటాము. చెప్పొచ్చిందేమిటంటే బస్తీనించి తమ కిష్టులైన పెద్దవాళ్లెవరన్నా వస్తే తాము మనసుపడే వస్తువు లేవన్నా తెస్తారని తాపత్రయపడుతుంటారు పిల్లలు సహజంగా. అందునా తనను వెంట తీసుక వెళ్లనందుకు జరిమానాగా గోపి అలా అడిగాడంటే ఆశ్చర్యపడవలసిన పని లేదు.

సొంత సొద చెప్పి మిమ్మల్ని విసిగిస్తున్నా నేమనుకోకండేం? నేను పల్లెటూరి వీధి బడిపంతుల్ని. కాస్త కూస్త భూవసతి మా నాన్నగారు ఏర్పాటుచేసి స్కూల్ ఫైనల్‌తో నా చదువు పరిపెట్టించారు. ఉన్న ఊళ్లో నలుగురు పిల్లలకు విద్యాదానం చేస్తూ, వచ్చే గ్రాంటుతో ఆ కొంచెం సాగుచేసుకుంటూ, పాడిపంటలతో గాదెల నిండుకు ధాన్యం పొర్లుతూ ఉంటే ఘుమఘుమలాడే కమ్మని ఆవునేతితో కడుపునిండుగా తిని కలెక్టర్లల్లే కాలుమీద కాలేసుకుని కూచోవచ్చు. ఒకరి కింతపెట్టి మనమింత తినవచ్చు. బస్తీలవెంట ఉద్యోగాలకని పరిగెత్తటమే కాని సాయిబు సంపాదన బూబు కుట్టుపోగులకు సరిపోదని హేళన చేస్తుండేవారు. ఆ తరం జీవితం అలా నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చింతగా వెళ్లిపోయింది. ఇప్పుడంతా తారుమారై ఇద్దన్నా దొరకని ఊర ఇనుముదయించటం మానేస్తున్నాడు. ఇళ్లు కట్టుకుని

దారా దొంగల భయం. కదలటానికి వీల్లేదు. చెరుకు పంట చేతి కందివచ్చి కోతకు సిద్ధంగా ఉంది. చూడావుకు ఈనె పొద్దులు. ఏమిటో, ఈ పల్లెటూళ్లలో ఏదుగో అనుకున్న పని ఇంకా నెలకైనా అయినట్టే. లక్ష అవాంతరాలు. కుప్పనూర్పిళ్ళు ధాన్యం ఇంటికి చేర్చి, కొంత ధాన్యం అమ్మి డబ్బు చేతబుచ్చుకుని అన్నదమ్ములం బయల్దేరి వెళ్ళేసరికి దాదాపు రెణ్ణెల్లు పట్టింది.

తీరా వెళ్లి విచారిస్తే పుట్టిన బిడ్డ పురిట్లోనే పోయిందనీ, కన్నబిడ్డను కంట జూచేందుకుకూడా వ్యవధి లేకుండా కూడబెట్టిన డబ్బు వెంటగట్టుకు పోవచ్చునని ఒక కాసును వైద్యసహాయం లేకుండా పొగొట్టారు. మరోటి బుద్ధిపూర్వకంగా గాలికి వదిలి ఊరుకున్నారు. పశువులమీద మీకున్నమాత్రం శ్రద్ధ బ్రతికున్న మనుషులమీద లేదనీ చాలా నిష్ఠురంగా మాట్లాడారు మా మరుదులు. అన్న మాటలన్నీ యథార్థాలే కావటంవల్లా, బిడ్డ పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిఉండటంవల్లా మరేం మాట్లాడలేక మౌనంగా తల వంచుకుని తిరిగి వచ్చేశాం. ఈ తర్జన భర్జనల్లో గోపిని దగ్గిరికి తీసి బుజ్జగించి మంచిచెడ్డలు కనుక్కునే వ్యవధానం లేకపోయింది. సంగతి తెలిసి వదిన "పాపం, చెల్లెమ్మ కడుపులో ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలౌతున్నాయో" అని చాలా నొచ్చుకుంది.

తరవాత తీరుబాటు చేసుకుని అన్నగారు వెళ్ళి మరదలినీ, బిడ్డలనూ పంపమని అడిగితే, తమ అప్ప బాగోగులు తాము చూచుకోగలమనీ మరేం విచారపడ నక్కరలేదనీ పెడసరంగా చెప్పి తిప్పి పంపించారు మా మరుదులు. పిల్లలు హైస్కూల్లో చదువుతున్నారుట. మధ్యలో కదిలించకూడదుట! ఇదో సాకు! ఇంటిగుట్టు తప్పుకెక్కిందని ఎంతగానో తల్లడిల్లిపోయింది వదిన!

వైశాఖం ఎండలు చంద్రనిప్పులు చెరుగుతున్నాయి. వరిపైరు కోసిన పొలాలలో పెంచిన వేరుసెనగ కట్టుబడై ఇళ్లకు వచ్చింది. మెట్టనేలను పండించిన మిరపపళ్లు ఎండి ఎండకుండా ఉన్నాయి. పాలేళ్లు తోటలో అంటుమామిడిపళ్ళు, మాజీవీడు చిన్న రసాలు బుట్టలకు దింపుతున్నారు. బంగినపల్లి మామి ళ్ళింకా పంటకు రాకచెట్లమీద విరగ్గాసిఉన్నాయి. పశువుల పెంట బళ్లకెత్తి పొలాలకు తోలిస్తున్నా రన్నగారు. ఉరుమూ మెరుపూ లేక ఊడిపడ్డ పిడుగల్లే వచ్చిపడ్డది బస్తీనుంచి టెలిగ్రాం, "గోపీ సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ" అని! పొద్దున్న ఇచ్చిన టెలిగ్రాం ఆరు వాగులు దాటి రన్నరు ద్వారా మాకు చేరేసరికి ఆరుగంటలపైన పట్టింది. నిజంగా నా నెత్తిన పిడుగు పడ్డట్టు దద్దరిల్లిపోయాను. మొదట్లోనే నాకు తెలిసితే ఎంత బావుణ్ను? నా తిప్పలేవో నే పడి నా బిడ్డను బతికించుకునేవాణ్ణేమో! తీరా ముంచుకొచ్చాక ఇప్పు డెవరు చెయ్యగలిగిం దేముం టుంది? పల్లెటూళ్లో వైద్యసౌకర్యం అమరలేదని గోలపెట్టిన పెద్దమనుషులు బస్తీలో ఉండి తాము వెలగబెట్టిన నిర్వాహక మిదేనా? పెద్ద చిరాకు వచ్చింది మా మరుదులమీద. ఎద్దులూ ఎద్దులూ కుమ్ముకుని లేగల్ని నగలదొక్కిన చందమయింది మా బతుకని కుంగి పోయాను. నాకోసం కెంగటి "నాన్నా, నాన్నా" అని ఎదురుతెన్నులు కాస్తూ ఆ చిన్నారిప్రాణి ఎంత అలమటిస్తున్నదో అని నా మనస్సంతా అల్లకల్లోలమై పోయింది. ఊపిరి పీలుస్తున్నానన్న మాటేగాని నిర్జీవుడ నయిపోయాను. వదిన నా అవస్థ చూచి "ఏమిటి, చినబాబూ, ఎప్పుడూ ఆడకూతుర్ని నేను నీకు ధైర్యం చెప్పవలసివస్తున్నది! ఎందు కంత బేజారైపోతావు? ఇప్పుడేం జరిగిందని?" అని ఆరే ఆరే దీపాన్ని ఎగసన తోసింది.

"ఇంకేం జరగాలి, వదినా? అవ్యక్తుణ్ణై బిడ్డను చేజేతులా నాశనం చేసుకున్నాను" అంటూ బావురు మన్నాను.

"తప్పు, బాబూ, ఊరుకో. కీడు శంకించకూడదు. ఏదో బిడ్డ నీమీద బెంగపెట్టుకుని ఉంటాడు. నిన్ను చూశాడంటే ఒళ్లో వచ్చి వాలతాడు, 'నాకేం తెచ్చావు, నాన్నా' అంటూ. జబ్బూ గిబ్బూ వాటంత టవే వదిలిపోతాయి!" అని ధైర్యం చెప్పింది వదిన.

ఇదివరకు బాప్యంచేసి ఇంతకు తెచ్చుకున్నామని ఉన్నట్టుగా బయల్దేరాము. వాగులన్నీ దాటుకుంటూ వెళ్లేసరికి చివరి బస్సు వెళ్లిపోయిందనీ, తెల్లవారితే గాని మరి బస్సు లేదనీ తేలింది. నిప్పులమీద నిలబడ్డట్టుంది నా పని. ఏమైనాసరే, తక్షణం వెళ్లితీరాలని చిందులు తొక్కుతున్నాను పసిపిల్లడిలా, సబబూ సందర్భమూ తెలుసుకోకుండా. బిడ్డ కడసారి చూపైనా అందుకోవాలని నా ఆవేదన! టాక్సీ వస్తుందేమోనని విచారిస్తే వంద అడిగారు తిరుగు బాడుగ కలుపుకుని. సరే, ఇస్తాం రమ్మంటే దోవంతా గతుకులుగా ఉంది. పైగా దొంగల భయం. మేము రామంటే రామని వెనకాడారు ఉన్న టాక్సీలవాళ్లు నలుగురూ. ఏం చెయ్యడానికి తోచక తిరుగుతుంటే ఒక తురకబిడ్డ మా అవస్థ చూచి తెగించి రిక్షా తెచ్చాడు. తెల్లవార్లూ ముప్పైమైళ్ల మా కట్టెలను ఈడ్చుకుపోతూనేఉన్నాడు. అన్నగారు గుండె చిక్క బట్టుకునున్నారేమోకాని నాకుమటుకు ప్రాణాలైతే ఎటో ఎగిరిపోయాయి.

కష్టపడి చేరవేసిన రిక్షావాడికి కృతజ్ఞత చెప్పి గడపలో కాలు పెట్టేసరికి ఇంట్లో అలికిడి లేదు. పెద్దాసుపత్రికి వెళ్లారని చెప్పారు పక్కఇళ్లలో విచారిస్తే. పడుతూ లేస్తూ పరిగెత్తి చూస్తే జనరల్ వార్డు కెదురుగా చెట్టుకింద శోకమూర్తిలా కూచునిఉంది ప్రసూన, బిడ్డను తన కాళ్లమీద పడుకోబెట్టుకుని, దింపుడుకళ్లతో అలగా నాకోసం ఎదురుచూస్తూ.

"గోపీ మనకు కాకుండాపోయాడు, బావా" అని గొల్లుమన్నారు మరుదులు. బెరుకుబెరుగ్గా దగ్గిరికి వచ్చి బావురుమన్నాడు పెద్దబిడ్డ రమణ. జబ్బేమిటని విచారిస్తే డాక్టర్లకే అంతు చిక్క లేదుట. మనోవ్యాధితప్ప మరే రోగలక్షణాలూ కనిపించలేదుట. సాయంత్రందాకా బాగానే మాట్లాడుతున్నాట్ట. ఉన్నట్టుండి సంధి పుట్టిందిట. సంధిలో "వచ్చావా, నాన్నా? నాకేం తెచ్చావు?" అనే గొణుక్కున్నాట్ట! పల్లెటూరినించి పుట్టతేనె, బుర్ర గుంజు, తాటికలకండ, ముంతమామిడిపప్పు ఎన్నెన్నో తెద్దామనుకున్న నా ఆశలన్నీ నిరాశలే అయ్యాయి. కళ్లచూపులుకూడా కరువయ్యాయి. "కట్టెనన్నా నా చేతి కివ్వం"డని గోలపెట్టాను. బిడ్డను తన కాళ్ల మీదినుంచి తీసి యాంత్రికంగా నా చేతి కందిస్తూ, గుడ్లనీరు కుక్కుకుంది ప్రసూన. కడసారిగా బిడ్డ కళేబరాన్ని ముద్దు పెట్టుకొని మరుదులవెంట నడిచాను శ్మశానానికి. గొయ్యి తవ్వి గోతిలో గుడ్డలు పరిచి పైన బిడ్డను వెల్లకిలా పండబెట్టి నన్ను కేక వేశారు. మూతలు పడని ఆ కళ్లు జీవంతో తొణికిస లాడుతూ, "నాకేం తెచ్చావు, నాన్నా?" అని నన్ను నిలదీసి అడిగినట్టనిపించి, "పిడికెడు మట్టిరా, బాబూ!" అని కుమిలిపోయాను. ★

సద్వైద్యశాల (ప్రైవేట్) లిమిటెడ్, నంజనగూడు
ఆయుర్వేద విద్వాన్ బి. వి. పండిట్ గారి నమ్మకమైన మందులు
మీ పండ్లకు చాల ఉత్తమమైనది, నిరపాయకరమైనది.
నంజనగూడు పండ్లపొడి
ఆపలునే కొనండి I. D. L. 61 ఔషధయుక్తమైనది. వేళ్లను వాడవద్దు
బిడ్డలకు
కాస్మస్ కస్తూరి మాత్రలు
కర్జన్ గోరోజన మాత్రలు
బాలక్స్ విరేచన మాత్రలు
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్. 54. బందరు వీధి. మద్రాసు.
మేము ఒక్కొక్క టౌనుకు ఒక పార్టీని "మా స్టాకిస్టు"గ తీసుకుంటాము. పోస్టేజి పంపుతూ పూర్తి జాబితా కొరకు వ్రాయండి.
మా డిపోలు: విజయవాడ, హైదరాబాద్, పుండలిక్ అండ్ కం., సుబాన్‌రోడ్డు, సికింద్రాబాద్.